జిల్లాకు 1316 మెట్రిక్‌టన్నుల ఎరువులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాకు కోరమాండల్ కంపెనీకి చెందిన 10:26:26 ఎరువులు వచ్చాయి. 1316 మెట్రిక్ టన్నులు, ఫాక్ట్ కంపెనీకి చెందిన అమ్మోనియం సల్ఫేటు ఎరువు 836 మెట్రిక్ టన్నులు వచ్చింది. బుధవారం నాడు ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు చేరాయి. వీటిని ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్ పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ ఆదేశం ప్రకారం వీటిని పంపిణీ చేస్తామని ఆయన తెలియజేశారు.

ఎరువులను పరిశీలిస్తున్న ఎడిఎ

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి

◆ ప్రజలపై విద్యుత్ భారాల మోత ◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

కూటమి ప్రభుత్వం అదానీకి అనుకూలంగా ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతూ ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని, దీనిని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా గుంతకల్లు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాడు పట్టణంలోని తిలక్ నగర్‌లో పర్యటించి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు దాని వల్ల కలిగే పరిణామాలపై ప్రజలకు తెలియజేశారు. వాణిజ్య భవన సముదాయాలకు సంబంధించి గతంలో ఉన్న సాధారణ మీటర్లు, ప్రస్తుతం ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్ల తర్వాత వచ్చిన బిల్లుల వ్యత్యాసాన్ని తెలుసుకున్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు తర్వాత బిల్లులు పెరిగాయంటూ వ్యాపారులు సిపిఎం నాయకుల ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు అధికం అయ్యాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లు పగులకొట్టాలని చెప్పిన నారా లోకేష్, ఇతర కూటమి నాయకులు ఇప్పుడెందుకు దానిపై నోరు మెదపడం లేదని నిలదీశారు. ట్రూఅప్, సర్దుబాటు, సర్‌ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలను వేస్తోందన్నారు. ఒకవైపు మిగులు ఉందని చెబుతూనే అదనపు సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వ్యాపారులు, చిన్న పరిశ్రమలపై విద్యుత్ సుంకం యూనిట్ 6 పైసల నుంచి 100 పైసలకు వైసిపి ప్రభుత్వం పెంచగా కూటమి ప్రభుత్వం దానిని కొనసాగిస్తోందన్నారు. వ్యాపారాల్లో ఆదాయం లేక అదనపు కరెంటు బిల్లులు కట్టలేక చిరు వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సర్దుబాటు ఛార్జీల భారంపై టిడిపి, వైసిపి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. అదానీ కంపెనీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్లు భవిష్యత్తులో విద్యుత్ ప్రయివేటీకరణకు సంకేతాలన్నారు. స్మార్ట్‌మీటర్లు వస్తే సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లిస్తేనే ఇళ్లకు కరెంటు సరఫరా అవుతుందన్నారు. ఇది పేదలపై అత్యంత భారం మోపే విధానం అన్నారు. ఈ మీటర్లతో ప్రజల వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం ఏర్పడుతుందనే అనుమానాలూ ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తాము చేస్తున్న తప్పులను గమనించి ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించే నిర్ణయాలు చేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా మొండిగా స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయాలని చూస్తే సిపిఎం ప్రజల పక్షాన నిలబడి అడ్డుకుంటుందని తెలియజేశారు. పెంచిన విద్యుత్ భారాలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలని కోరుతూ ఆగస్టు 5వ తేదీన గుంతకల్లు సమీపంలోని ఆలూరు రోడ్డు విద్యుత్ శాఖ డిఎఇ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు షబ్బీర్, తిమ్మప్ప, బాషా, చంద్రశేఖర్, ఈరన్న, ఖాదర్, సుధాకర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలని కోరుతూ ఆగస్టు 5వ తేదీన డిఎఇ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమం కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

అర్హులందరికీ సంక్షేమఫలాలు

◆ ఇళ్ల స్థలాలిచ్చి పక్కా ఇళ్లు నిర్మిస్తాం
◆ సూపర్-6 అమలుకు కట్టుబడి ఉన్నాం
◆ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేలా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని గృహనిర్మాణశాఖ మంత్రి కొసులు పార్థసారథి తెలియజేశారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని చాపిరి గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో కొండగుట్టపై నివాసమున్న వారికి అనువైన ప్రాంతంలో స్థలం చూపి పక్కా ఇల్లు నిర్మించాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అస్తవ్యస్త పాలన సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పారదర్శకంగా అర్హులకు న్యాయం జరిగేలా పాలన సాగిస్తున్నారన్నారు. ఆర్థిక ఒడిదుడుకులున్నా సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ 36 ప్యాకేజీ కింద చాపిరి చెరువును కృష్ణ జలాలను నింపుతామన్నారు. బీటీపీ ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేసి నీటిని తీసుకొస్తామని ఇందుకు రైతుల సహకారం అవసరమని తెలియజేశారు. గ్రామస్తుల విన్నపం మేరకు చాపిరిలో రూ.35లక్షలు, మాదిరెడ్డిపల్లిలో రూ.25లక్షలతో సీసీరోడ్లు నిర్మిస్తామన్నారు. రాళ్లగుట్ట పై నివాలసమున్న వారికి ప్రత్యామ్నయంగా గృహాలు నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, పరిశీలకుడు నాగేశ్వర్, మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవి, ఆర్డీవో వసంతబాబు, హౌసింగ్ పీడీ శైలజ, సీనియర్ నాయకులు రామ్మోహన్‌చౌదరి, మల్లికార్జున, వైపీ రమేష్, మండల కన్వీనర్ వెంకటేశులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

మంత్రి పార్థసారథి పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలిసి భూమిపూజ చేశారు. మున్సిపాలిటీలోని పాతబస్టాండ్ వద్ద డ్రైనేజీ అభివృద్ధి పనులు రూ.2.20కోట్లు, ఎమ్మెల్యే సొంత నిధులు రూ.50లక్షలతో వాల్మీకి సర్కిల్ అభివృద్ధి, చాపిరి, మాదిరెడ్డి పల్లి గ్రామాలలో సుమారు రూ.60లక్షలో సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

కార్యకర్తలు, అధికారులతో విడివిడిగా సమీక్షలు

మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రజావేదికలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిన అభివృద్ధి ఫలాలను తెలియజేయాలని, గత ప్రభుత్వం చేసిన అన్యాయాలపై ప్రజలకు చైతన్య పరచాలని నాయకులు కార్యకర్తలకు తెలిపారు. అనంతరం హౌసింగ్ పీడీ శైలజ, డీఈ విజయభాస్కర్, ఏఈలతో గృహనిర్మాణాల విషయంపై సుదీర్ఘంగా సమీక్ష చేశారు. స్థలం, గృహాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు కావాలని అడిగిని ప్రతి ఒక్కరూ మంజూరు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని అవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే సురేంద్రబాబు

మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు జగన్

చైతన్యాన్ని నింపేది పాట

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా చైతన్యాన్ని నింపేది పాట అని ప్రజా నాట్యమండ రాష్ట్ర నాయకులు జగన్ తెలిపారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం విజయవంతంగా ముగిశాయి. గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు జగన్ మాట్లాడుతూ కళా రంగంలో పాట ప్రాథమిక ఆయుధం లాంటిదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, భజన బృందాలు కోలాటాలు తదితర కళలు, కళాకారులు ఉన్నారన్నారు. ఇటీవల కాలంలో ఈ కళలు ఆదరణ కోల్పోతున్నాయని తెలిపారు. ప్రాచీన కళలు, కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కళాకారులకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజానాట్యమండలిని జిల్లాలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా గైడ్ ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, నాయకులు ఎర్రిస్వామి, ఈశ్వర్, లక్ష్మీనారాయణ, పుల్లన్న, బ్రహ్మయ్య, నాగేంద్ర, కృష్ణవేణి, అశ్వని, చంద్రిక, రేణుక, నాగవేణి, వాణి, సోమక్క పాల్గొన్నారు.

మురుగుకాలువ సమస్యపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీ జన చైతన్య నగర్ కాలనీ చర్చి వద్ద 20 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న మురుగునీటి కాలువ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. చైతన్య కాలనీ వ్యవస్థాపకులు, టిడిపి నాయకులు బాబా ఫక్రుద్దీన్ వలి ఆధ్వర్యంలో బుధవారం నాడు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురునీటి కాలువ సరిగా లేక చర్చి వద్ద లోతట్టు ప్రాంతం వద్ద నివాసం ఉంటున్న దాదాపు 30 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటోందన్నారు. రోడ్డు మార్గాన కాలువ ఏర్పాటు చేసి మురుగునీటి గుంత లేకుండా చూడాలని కోరారు. ఎమ్మెల్యే శ్రావణిశ్రీ స్పందిస్తూ మురికినీటి గుంత లేకుండా సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు సూచించారు.

సామాన్యుల ఇళ్లకు వెళ్లండి

వైసిపి నాయకులకు టిడిపి నేతల హితవు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాకే లక్ష్మీనరసింహ్మ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని తెలుసుకోవాలంటే సామాన్యుల ఇళ్లకు వెళ్లాలని, వైసిపి కార్యకర్తల ఇళ్లకు వెళ్లడం ద్వారా ఏమి ప్రయోజనం అంటూ టిడిపి నాయకులు తెలియజేశారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ బుధవారం విలేకరులతో మాట్లాడారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో వైసిపి నాయకులు కొత్త రకం నాటకాలకు తెరలేపారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ విషయాన్ని ఏ ఇంటికి వెళ్లినా వైసిపి నాయకులకు చెబుతారన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎన్నో అభివద్ధి కార్యక్రమాలు ఈ ఏడాది కాలంలో చేపట్టారన్నారు. వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి శివకృష్ణ, తెలుగుయువత నాయకుడు శశి భూషణ్ పాల్గొన్నారు.

'తోపుదుర్తి'కి మరో తలనొప్పి..!

◆ రాక్రీట్‌పై విచారణ పూర్తయిందన్న మంత్రి ◆ చర్యలు తప్పవా.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మరో తలనొప్పి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆయనపై పలురకాలైన కేసులు నమోదయిన విషయం తెలిసిందే. ఇక వైసిపి ప్రభుత్వ హయంలో నిర్మించిన గృహ నిర్మాణాలకు సంబంధించి కూడా కొత్తగా సమస్యలొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసిపి హయాంలో జగనన్న కాలనీల్లో నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే కాంట్రాక్టును రాక్రీట్ ఇన్‌ప్రాస్ట్రక్చర్ సంస్థ తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో సుమారు 15వేల వరకు ఇళ్ల నిర్మాణాల కాంట్రాక్టును తీసుకున్న రాక్రీట్ సంస్థ సకాలంలో పనులు పూర్తి చేయలేదు. చాలా వరకు అసంపూర్తిగానే ఇళ్ల నిర్మాణాలున్నాయి. దీనిపై అనేక ఆరోపణలు కూడా వచ్చిన నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ విచారణకు ఆదేశించారు. ఇప్పటికే చాలా వరకు నివేదిక పూర్తయినట్టు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో తెలిపారు. విచారణలోనున్న అంశాలు ఇప్పుడే వెల్లడించలేమని అన్నారు. మొత్తంలో ఈ విచారణలో లోపాటను విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు శాఖ గుర్తించినట్టు సమాచారం. చాలా వరకు పనులు చేసిన దానికంటే ఎక్కువ బిల్లులు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో ఏ మేరకు బిల్లుల చెల్లింపులు జరిగాయన్నది విచారణ నివేదిక ఆధారంగా వెలుగులోకి వచ్చే అవకాశముంది.

రాక్రీట్‌లో ప్రకాష్‌రెడ్డి బంధవులు ?

రాక్రీట్ ఇన్‌ప్రాస్ట్రక్చర్ సంస్థ గృహ నిర్మాణ పనులను చేపట్టింది. ఇందులో అనంతపురం నగరానికి సంబంధించి కూడా ఆలమూరు వద్ద లేఅవుట్‌లో నిర్మాణాలు జరిగాయి. రాక్రీట్ సంస్థ నేరుగా తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి లేకపోయినప్పటికీ ఆయన సమీప బంధవులు కొందరున్నారు. తోపుదుర్తి అమర్‌నాథరెడ్డి, గడ్డం మదన్‌మోహన్‌రెడ్డి, గంట్ల సునీల్ దత్త కుమార్‌రెడ్డిలు డైరెక్టర్లుగానున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలోనే వీరు ఈ సంస్థలో డైరెక్టర్లుగా చేరారు. సాంకేతికంగా వీరు సంస్థలోనున్నప్పటికీ నిర్వహణలో ప్రకాష్‌రెడ్డి పాత్ర ఉన్నట్టు ప్రచారం నడుస్తోంది.

ఆయనపైనా చర్యలుండేనా ?

రాక్రీట్ సంస్థపై జరిగిన విచారణలో అవకతవకలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో ప్రకాష్‌రెడ్డిని కేసులు వెంటాడుతాయా లేక సంస్థలో భాగస్వామ్యులుగా ఉన్న వారితోనే సరిపెడతారా అన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా గృహ నిర్మాణాల్లో జరిగిన అవకతవకలు ప్రకాష్‌రెడ్డికి మరో తలనొప్పినే తెచ్చిపెట్టే పరిస్థితులే ఎక్కువగా కన్పిస్తున్నాయి.

మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

బాబు హామీలు గాలిమాటలే..

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-రాప్తాడు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ గాలి మూటలేనని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. రాప్తాడు వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ చెప్పిన హామీలు అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు నైజం అన్నారు. ఇక రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పరిటాల కుటుంబ సభ్యులు, వారి బంధువుల అక్రమాలు పేట్రేగాయన్నారు. తాను అక్రమ కేసులకు భయపడేది లేదని, చట్టపరంగా ముందుకెళ్తామని తెలియజేశారు. రాప్తాడులో రౌడీ రాజ్యాంగాన్ని అంతమొందించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి.

తాగునీటి ట్యాంకులు ఏర్పాటు

పెద్దవడుగూరు : మండలంలోని చిన్నవడుగూరుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరప్ప, సావిత్రమ్మ దంపతులు వారి స్వగ్రామంలో సొంత నిధులతో తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. సొంత నిధులతో బోరు వేయించి ట్యాంకు కట్టించారు. ఈ ట్యాంకులను బుధవారం నాడు వారు ప్రారంభించారు.

ఉద్యోగోన్నతి ఎస్ఐలకు సన్మానం

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐలుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఎస్ఐలుగా బదిలీపై వెళ్తున్న ఇద్దరిని బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సన్మానించారు. సిఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో సంపత్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్‌లను సన్మానించారు. వీరిద్దరూ నంద్యాల జిల్లాకు ఉద్యోగోన్నతిపై వెళ్లారు.

రూ.లక్ష విలువజేసే ఒంగోలు జాతి ఆవు మృతి

పశువైద్యాధికారి స్పందించలేదంటూ బాధితుడి ఆవేదన

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పశువైద్యులు సకాలంలో గ్రామానికి రాక ప్రసవ సమయంలో ఒంగోలు జాతి ఆవు మృతిచెందిన ఘటన బుధవారం మండల పరిధిలోని భీమునిపల్లిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన పురుషోత్తమరెడ్డి ఎంబిఎ చదివినా పాడిపరిశ్రమపై ఆసక్తితో గ్రామంలోనే స్థిరపడ్డాడు. ఒంగోలుజాతి ఆవుల పెంపకం చేపట్టారు. ప్రసవ సమయంలో ఉన్న తన ఒంగోలు జాతిఆవు రెండురోజులుగా మెత్తబడిందని వైద్యురాలు కమలమ్మకు తెలియజేశారు. ఈ సమయంలో ఆమె తాను గ్రామానికి రాలేనని, మీరే ఆవును తీసుకురావాలని లేకుంటే తాను రాసిచ్చిన మందులు వాడండి అంటూ సలహా ఇచ్చారు. చేసేదేమి లేక ఆయన మందులను వాడాడు. అయినా ఫలితం లేక ఆవు మరణించింది. పది రోజుల క్రితం మరో ఆవు కూడా ఇలానే మరణించింది. పశు వైద్యాధికారుల నిర్లక్ష్యంతోనే రూ.2లక్షల విలువజేసే తన ఆవులు మృతి చెందాయని బాధిత రైతు పురుషోత్తమరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. పశువైద్యాధికారి గ్రామానికి ఏ ఒక్క రోజూ రావడం లేదన్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పరిశీలన చేయాలని కోరారు.

నేడు నగరంలో తాగునీటి సరఫరా బంద్

అనంతపురం కార్పొరేషన్ : పీఏబీఆర్ డ్యామ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోటర్లకు కరెంటు సరఫరా చేసే 300ఎంఎం కేబుల్ కాలిపోయిన నేపథ్యంలో నగరంలో గురువారం ఉదయం సాయంత్రం నీటి సరఫరా జరగదని కమిషనర్ బాలస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి, అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతాంగాన్ని ఆదుకుంటాం

ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి

హెచ్‌ఎల్సీ కాలువ పూడికతీత పనుల పరిశీలనకు వెళ్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

తాడిపత్రి నియోజకవర్గంలో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు తమశక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలం నుంచి నియోజకవర్గంలోకి వెళ్తున్న ప్రధాన హెచ్చెల్సీ కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులను మిడుతూరు వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు మండలాలు ఉండగా అన్ని మండలాలకు సాగునీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈఏడాడి ఉత్తర కాలువ ద్వారా 4వేల క్యూసెక్కుల నీటిని అందించాలని ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రధాన కాలువల్లో పూడిక పేరుకుపోయి సాగునీటికి తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఎస్‌వి.రవీంద్రారెడ్డి, క్లాస్‌వన్ కాంట్రాక్టర్ హరినాథ్ రెడ్డి, కేశవరెడ్డి, గంగరాజు, దివాకరరెడ్డి, హరినాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, తిలక్ రెడ్డి, నారాయణస్వామి, వెంకటరామిరెడ్డి, బాలరాజు, రమేష్ యాదవ్, ఓబిలేసు, అపేచర్ల చంద్ర, దాదావళి, యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, ఎస్సీ మహిళా నాయకురాలు కమలమ్మ పాల్గొన్నారు.

వాహనాలతో శబ్ధాలు చేస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

సైలెన్సలర్లను రోడ్డురోలర్‌తో తొక్కిస్తున్న ఎస్పీ జగదీష్

ద్విచక్ర వాహనాలకు పరిమితి మించి సైలెన్సర్లు బిగించుకుని భారీ శబ్దాలు చేసే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. అధిక శబ్దాలు చేస్తూ తిరుగుతున్న వాహదారులపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. అనంతపురం నగర పోలీసులు స్వాధీనం చేసుకున్న 150 టూవీలర్ల సైలెన్సర్లు, 300 ఆటోల హార్న్‌లను గురువారం సాయంత్రం స్థానిక క్లాక్ టవర్ సమీపంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలకు కంపెనీ సైలెన్సర్లు కాకుండా వాటి స్థానంలో భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లు బిగించుకుని రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు అసౌకర్యానికి గురి కావడమే కాకుండా శబ్ద కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఒక్కోసారి సాటి వాహన చోదకులు ఏకాగ్రత లోపించి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వీటన్నింటినీ దష్టిలో ఉంచుకుని వాహనదారులు అధిక శబ్ధాలు చేసే సైలెన్సలర్ల వినియోగం ఆపాలన్నారు. నగరంలో వాహనాలు ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేస్తే వెహికల్ వీల్ లాక్స్‌తో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సిఐలు వెంకటేష్ నాయక్, శ్రీకాంత్ యాదవ్, శాంతిలాల్, జగదీష్ ఎస్ఐలు శ్రీనివాస్, రుష్యేంద్రబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ వద్ద ధర్నా : ఫ్యాప్టో

ప్రజాశక్తి-అనంతపురం

విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఆగస్టు 2వ తేదీ కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్‌నాయక్, జనరల్ సెక్రటరీ పురుషోత్తం పిలుపునిచ్చారు. నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో బుధవారం ఫ్యాప్టో ఛైర్మన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పిఆర్‌సి, ఐఆర్, డిఎ, సరెండర్ లీవ్స్, తదితర సమస్యలపై ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ధర్నాలో జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కో ఛైర్మన్ లింగమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గోవిందరాజులు, రమణారెడ్డి, వెంకటేష్, సెక్రటరీ వెంకటరత్నం, కార్యవర్గ సభ్యులు సిరాజుద్దీన్, మల్లికార్జున, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, ఎస్‌టియు రాష్ట్ర అదనపు కార్యదర్శి సూర్యుడు, ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు, వివిధ సంఘాల రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్ నాయక్

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి- బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని సాయిబాబా గుడి దగ్గర పోలీసులు వాహనాల తనిఖీని బుధవారం చేపట్టారు. సిఐ పుల్లయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టి, రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. ద్విచక్రవాహనం నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు.

దుర్గం కౌన్సిల్ సమావేశం రసాభాస

ప్రజాశక్తి-రాయదుర్గం

వాగ్వాదం చేసుకుంటున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్

పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలు లో బుధవారం చైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశం రసాభాసగా మారింది. నిధుల కేటాయింపు, అజెండా రూపకల్పన లో 'చైర్‌పర్సన్ సరిగా లేరు' అని 5వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి ప్రశ్నించడంతో కాసేపు వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమావేశం ముగిసి శ్రీనివాస్‌రెడ్డి బయటికు వెళ్తుండగా మెట్ల వద్ద ఆయనను చైర్‌పర్సన్ అడ్డుకున్నారు. అజెండా తన ఇంట్లో తయారు కావడం లేదని, అధికారులు కార్యా లయంలో తయారు చేస్తున్నట్లు తెలిపారు. స్పందించిన ఆయన కౌన్సిల్ హాల్‌లో కూర్చుని సమాధానం ఇవ్వాలని పట్టుబట్టారు. ఇంతలో ఎస్ఐ రామ్ ప్రసాద్, పోలీసులు అక్కడికి చేరుకుని వారికి సర్ది చెప్పారు. నిధుల కేటాయింపులో వివక్ష చూపుతు న్నారని 28వ వార్డు కౌన్సిలర్ గోవింద రాజులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో అతడికి టిడిపి కౌన్సిలర్ పద్మజ మధ్య వాదోప వాదాలు జరిగాయి. జీరో అవర్‌లో పలువురు సభ్యులు మాట్లాడుతూ అత్యవసర సమావేశానికి సంబంధించిన అజెండాను కనీసం ఒకరోజు ముందుగా సభ్యులకు అందజేస్తే సమావేశంలో చర్చకు వీలవుతుందని తెలిపారు. ఎస్‌సి కాలనీ లో నీరు సమృద్ధిగా ఉన్నా ఐదారు రోజులకొకసారి సరఫరా చేయడం ఏంటని సభ్యులు నిలదీశారు. కోట ముఖ ద్వారం జీర్ణోద్ధరణ నేపథ్యంలో మునిసి పాలిటీ నిధులు మళ్లించాలని కౌన్సిలర్ అజయ్‌కుమార్ కోరారు. అజెండాలోని అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిఈ సిసింద్రి, ఏఈ నరసింహులు, టిపిఎస్ మురళీ మోహన్, మేనేజర్ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై న్యాయపోరాటం చేస్తాం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

నూతనంగా ఎన్నికైన లీడర్లు

అంగన్వాడీల సమస్యలపై న్యాయ పోరాటం చేస్తామని అంగన్వాడీ మండల యూని యన్ సెక్టార్ లీడర్లు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షురాలు శకుంతల ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అంగన్వాడీ వర్కర్లందరూ కలిసి సెక్టార్లకు నూతన లీడర్లను ఎన్నుకున్నారు. బ్రహ్మ సముద్రం మండల యూనియన్ లీడర్‌గా గొంగిరెడ్డి పల్లి తిప్పేరమ్మను ఎన్నుకున్నారు. బ్రహ్మసముద్రం సెక్టార్‌లో సత్య వతి, పాలవెంకటాపురం-సుజాత, వేపులపర్తి-పొబ్బర్లపల్లి సుజాత, పోలేపల్లి అనిత, సంతోషమ్మ, అలాగే మినీ లీడర్‌గా ఎరడికెర త్రివేణిని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం అలుపెరుగకుండా న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. తమపై నమ్మకం ఉంచి లీడర్లుగా ఎన్నుకొన్నందుకు అంగన్వాడీ వర్కర్లకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా లీడర్లకు సిఐటియు నాయకులు విధులు, బాధ్యతలను వివరించారు.

వైసిపి ఆధ్వర్యంలో 'చంద్రబాబు మేనిఫెస్టో రీకాలింగ్'

ప్రజాశక్తి-నార్పల

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి మండల కన్వీనర్ ఖాదర్‌వలి ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని రంగాపురం, దుగుమర్రి, నీల్‌తోటిపల్లి, తుంపెర గ్రామాల్లో 'చంద్రబాబు మేనిఫెస్టో రీకాలింగ్" కార్యక్రమం చేపట్టారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్‌సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టో, మోసం చేసిన తీరును వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి నాగేశ్వరరావు, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, రాజారెడ్డి, ఉప సర్పంచి శ్రీరాములు, సిద్దిరాచర్ల సర్పంచి రామాంజనే యులు, నాయకులు బయపురెడ్డి, నారాయణరెడ్డి, దాడితోట బాషా, అమీర్‌బాషా, గోపాల్‌రెడ్డి, బాలనాగి రామాంజనే యులు, రాముడు, జిలాన్‌బాషా, భాస్కర్‌నాయుడు, వెంకటనారాయణరెడ్డి, రామాంజనేయులు, గోపాల్, ఆదినారాయణ, రవికుమార్, సోహెల్, సాయి, ప్రవీణ్, హరినాథ్‌రెడ్డి, నౌషాద్, దాదాపీర్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కందికాపుల, చింతకుంట, నాయకునిపల్లి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపట్టారు. వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కందిగోపుల శ్రీధర్‌రెడ్డి, సూరి, వెంకటశివారెడ్డి, గజ్జల నాగార్జునరెడ్డి, చింతకుంట బాలసుబ్బారెడ్డి, నాయకునిపల్లి సుధాకర్, సుంకన్న, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మహిళా విభాగం రూరల్ కన్వీనర్‌గా అనిత

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం వైసిపి మహిళా విభాగం కన్వీనర్‌గా ఆలమూరు గ్రామానికి చెందిన బోయ అనితను ఎంపిక చేశారు. ఆమె మాట్లాడుతూ రూరల్ మండలంలో వైసిపిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రూరల్ మండల్ కన్వీనర్ గోవిందరెడ్డికి ధన్య వాదాలు తెలిపారు.

రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించాలని వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

మండలంలో వెంటనే రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమిం చాలని సిపిఎం నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి సూరి మాట్లాడుతూ రెండు నెలలుగా రెగ్యులర్ తహశీ ల్దార్ లేకపోవడంతో మండల ప్రజలు సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వన్‌బి, అడంగల్, మ్యుటేషన్, తదితర సమస్యలపై రైతులు, ఆదాయ, కుల ధ్రువీ కరణ పత్రాల కోసం విద్యార్థులు కార్యాలయానికి వెళ్తే తహశీల్దార్ లేరు మేము కూడా ఏమి చేయలే మని సిబ్బంది సమాధానం చెబుతున్నారని తెలిపారు. కావున కలెక్టర్, ఆర్డీవో స్పందించి తక్షణమే మండలా నికి రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.పెద్దయ్య, జి.వెంకట చౌదరి, బి.భాస్కర్‌రెడ్డి, కె.నాగభూ షణ, జె.పెద్దయ్య, వీటి కుల్లాయప్ప, టి.ఆదినారాయణ, రామంజులరెడ్డి, సుబ్బరాయుడు, నల్లప్ప పాల్గొన్నారు.

రేపు 'తెలుగు వెలుగు' వార్షికోత్సవ సభ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని జిల్లా గ్రంథాలయ సమావేశ మందిరంలో ఆగష్టు 1వ తేదీ దయం 10 గంటలకు నిర్వహించే తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఐదో వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఆ సభలో సాహిత్య, సామాజిక సేవలకులను సత్కరించడంతో పాటు టివి.రెడ్డి రచనలో వెలువడిన 'అమరమ్' అనే కవితా సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి-అనంతపురం

మొక్క నాటి నీరు పోస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని శ్రీచైతన్య పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి సూచించారు. నగరంలోని కోర్టు రోడ్డు శ్రీచైతన్య పాఠశాల లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎజిఎం విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యత, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చెట్లు మానవ మనుగడకే కాకుండా ఇతర జీవుల ఆవాసానికి దోహదం చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుమ్, డీన్‌లు సిరాజుద్దీన్, చిరంజీవి, ఏవో గోపాల్, అకాడమీ కోఆర్డినేటర్ ఇర్షాద్, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నూతన వధువుకు కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే

'డేగల' కుమార్తె పెళ్లికి హాజరైన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని గుమ్మేపల్లి గ్రామానికి చెందిన టిడిపి జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి కుమార్తె వివాహానికి బుధవారం ఎమ్మె ల్యే బండారు శ్రావణిశ్రీ హాజరై నూతన వధూవ రులను ఆశీర్వదించారు. కానుక అందజేశారు. అంతకుముందు డేగల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కు ఘనం స్వాగతం పలికారు. ఆమె పెళ్లికి హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలతో కాసేపు ముచ్చటిం చారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ ఆదినారా యణ, మారుతినాయుడు, సింగిల్ విండో ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీనారాయణ, చంద్ర మోహన్, నారాయణస్వామి, సుదర్శన్‌నాయక్ ఉన్నారు.

నేడు డ్వామాలో ఈసి, జెఈలకు శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని డ్వామా సమావేశ మందిరంలో గురువారం ఈసీ, జెఈలకు టివోటి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీంబాషా తెలిపారు. అందులో జియో ట్యాగింగ్, జియో–ఫెన్సింగ్ మొబైల్ యాప్ ప్రత్యక్ష అప్లికేషన్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రతి మండలం నుంచి ఒక టెక్నికల్ అసిస్టెంట్ హాజరు కావాలన్నారు. అలాగే క్లస్టర్ పరిధిలో జరిగే ట్రైనింగ్ ప్రోగ్రాంలో మొబైల్ యాప్ పని తీరు, క్షేత్రస్థాయిలో ఎలా ఉపయోగిస్తారు అనే అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కావున ప్రతి మండల నుంచి ఒక ఈసీ, జెఈ, టెక్నికల్ అసిస్టెంట్ హాజరు కావాలని తెలిపారు.

సొసైటీ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని సొసైటీ కార్యాలయాన్ని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరి సందర్శించారు. ఆమె రికార్డులను తనిఖీ చేశారు. అలాగే రైతులకు పంపిణీ చేసిన ఎరువులు, స్టాక్, పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ప్రతి రైతుకు ఆధార్ కార్డుతో ఐదు బస్తాల యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు. ఎరువుల కొరత తీర్చాలని రైతులు కోరగా స్టాక్ వస్తుందని అతి త్వరలో రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మండలానికి యూరి యా, కాంప్లెక్స్, డిఎపి ఎరువులను సరఫరా చేయా లని రైతులు కోరగా తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఎడిఎ, ఏవో సాయికుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

రేపు గూగూడులో చక్కెర వేలం

నార్పల : మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణలో ఆగస్టు 1వ తేదీ ఉదయం 8 గంటలకు 4 వేల కిలోల చక్కెరను వేలం వేస్తున్నట్లు ఈఇవో సాకేతపురం శోభ ఓ ప్రకటనలో తెలిపారు వేలంలో పాల్గొనదలిచినవారు రూ. 20 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు

బెలుగుప్ప : స్థానిక గౌరసంద్ర మారెమ్మ దేవత ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి హుండీలోని కానుకలను లెక్కించారు. అందులో రూ. 51,300 ఉందని, ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తిప్పారెడ్డి, కలప్ప, ఆవులన్న, యు.హనుమంత పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

అనంతపురం : సీమ ప్రాజెక్టులకు రూ. 7 నుంచి రూ. 8 వేల కోట్ల నిధులు కేటాయించి వేగవంతంగా పూర్తి చేయాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త శైలజనాథ్ డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బనకచెర్ల ప్రాజెక్టు ద్వారా సీమకు నీళ్లు తరలిస్తామని సిఎం చంద్రబాబు పేర్కొంటున్నారని ఆ నీరు అవసరం లేదని హంద్రీనీవా, గాలేరు నగరి, కెసి కెనాల్, హెచ్‌ఎల్సీ ప్రాజెక్టులు పూర్తి చేస్తే సీమలో పది లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయన్నారు. బనకచెర్ల ప్రాజెక్టుకు రూ. 81వేల కోట్లు ఖర్చు చేయడం కంటే రూ. 8వేల కోట్లు ఖర్చు చేస్తే సీమ సస్యశ్యామలం అవుతుందన్నారు.

సేవాఘడ్‌లో పుస్తకాల ఆవిష్కరణ

గుత్తి : రంజిత్‌నాయక్ వర్ధంతి పురస్కరించుకొని బుధవారం బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం(సేవ ఘడ్)లో ప్రొఫెసర్ గోనానాయక్ రచించిన నాలుగు పుస్తకాలను శ్రీసంత్ సేవాలాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రొఫెసర్ గోనానాయక్ భారతీయ గిరిజన వీరులు, సుగాలి సాంస్కృతిక భాష, సాహిత్యాలు, బతుకు దీర్ఘ కవిత, మా నాయన సెప్పిన కథలు అనే పుస్తకాలను రచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, కోశాధికారి రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.

జెడ్.వీరారెడ్డి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

గుత్తి: పట్టణ సమీపంలోని జెడ్. వీరా రెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం నాయకుడు బి. రామకృష్ణ, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలనీలో ప్రధాన, అంతర్గత రహదారులు, డ్రెయినేజీ కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సత్యసాయి తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు అశోక్,మారి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

పుట్లూరు : స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం జడ్పీ సిఇఒ శివశంకర్ పరిశీలించారు. ముందుగా ఆయన పుట్లూరులో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. తడి చెత్త, పొడి చెత్తను ఇంటివద్దనే వేరు చేసి హరిత రాయబారులకు అందించాలని ప్రజలకు సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపిడిఒ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సంధ్య ఉన్నారు.

కళాశాల వేళలను పాత పద్ధతిలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

సమావేశమైన ఎస్ఎఫ్ఐ నాయకులు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ డిమాం డ్ చేశారు. జూనియర్ కళాశాలలో బుధవా రం ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులు సమావే శం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఓతూరు పరమేష్, వంశీ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఉన్నారన్నారు. వారికి అనుగుణంగా భోజనశాల, మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే శిక్షణ ఇచ్చేందుకు పిడిని నియమించాలన్నారు. కళాశాల వేళలను గతేడాది తరహాలనే పాత పద్ధతిలోనే కొనసాగించాల న్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు అనుమతించా లని, ఆఫ్‌లైన్ విధానం లోనే అడ్మిషన్స్ ప్రారంభించా లని కోరారు. అనంత రం ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షు డిగా నవదీప్, కార్యదర్శిగా ధనుష్, బాలికల కన్వీనర్‌గా కీర్తన, కన్వీనర్‌గా మాలశ్రీ, ఉపాధ్యక్షులుగా సతీష్, విజయ్, నాయకులు ప్రభుకిరణ్, దర్శన్, రేవంత్, అరుణ్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి తోడ్పాటునిస్తాం

ప్రజాశక్తి-బెలుగుప్ప

కార్యక్రమంలో మాట్లాడుతున్న కంపెనీల ప్రతినిధులు

మండల అభివృద్ధికి చేయూతనంది స్తామని సుజలాన్ కంపెనీ, సాహస ప్రాజెక్టు ప్రతిని ధులు హామీ ఇచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో బుధవారం ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సుజలాన్ కంపెనీ స్టేట్ అధికారి జి.రామకృష్ణ, సాహస ప్రాజెక్టు మేనేజర్ నగేష్, వీరమోహన్, గిరిబాబు పాల్గొని మాట్లాడారు. బెళుగుప్ప, తగ్గుపర్తి గ్రామాలను మూడేళ్ల లోపు స్వచ్ఛత లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే చెత్తతో సంపద సృష్టించి ఆదాయం పెంచి మండలం అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నిరుద్యోగు లకు ఏడాది పాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. బస్టాండ్‌లో టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కరపత్రా లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పం చులు సాలిబాయి, రామ్మోహన్, ఈవోఆర్‌డి శివరంజని, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షులు పెద్దతిప్పయ్య, ఎంపి డిఒ కార్యాలయం, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో మానవ అక్రమ రవాణా నియంత్రణ

ప్రజాశక్తి-అనంతపురం

అవగాహన సదస్సులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

సమిష్టి కృషితో మానవ అక్రమ రవాణాను నియంత్రించవచ్చని రెడ్స్ స్వచ్ఛం ధ సంస్థ వ్యవస్థాప కురాలు భానుజా పేర్కొ న్నారు. జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న జిల్లా లీగల్ అథారిటీ కార్యాల యంలో రెడ్స్ ఎన్జీవో వ్యవస్థాపక అధ్యక్షురాలు భానుజా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిం చారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు హాజరై బాల కార్మికులు, బాల్య వివాహాలు, అవయవ స్మగ్లింగ్ రవాణా వల్ల జరిగే అనర్థాలు, చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి వాటికి గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సదస్సులో జిల్లా డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాజశేఖర్, మహిళా శిశు సంక్షేమ, పోలీస్, న్యాయ శాఖలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, డిఎంహెచ్ఒ, డిఆర్‌డిఎ, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, రెడ్స్ స్వచ్ఛంధ సంస్థ సభ్యులు, బాధితులు పాల్గొన్నారు.

'శైలుకు టిడిపిని విమర్శించే అర్హత లేదు'

ప్రజాశక్తి-శింగనమల

సిఎం చంద్రబాబు, టిడిపిని విమర్శించే అర్హత నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త శైలజ నాథ్‌కు లేదని మండల టిడిపి నాయకులు పేర్కొ న్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024కు ముందు టిడిపి ఎమ్మెల్యే సీటు కోసం నియోజకవర్గ టిడిపి నాయకుల చుట్టూ తిరగడం మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు జగన్‌పై మీరు చేసిన అవినీతి ఆరోపణలు గుర్తు లేవా అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విశేష కృషి చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేయడం దిగజారుడుతనమే అన్నారు. ఇకనైనా ఇలాంటి విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, అధి కార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ, మారుతినాయుడు, పెద్దిరెడ్డి, చంద్రమోహన్, పెద్దన్న, దండు విజయ్‌కుమార్, ఖాదర్‌వలి, నారాయణస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ఇలాహి షాదీఖానాలో బుధవారం నిర్వహించిన ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రియాజ్, ఉపాధ్యక్షులు గా సికిందర్, ఖురేషి అన్వర్, డిష్ అన్వర్, ప్రధాన కార్యదర్శిగా అప్పేచెర్ల దస్తగిరి, సహాయ కార్యదర్శు లుగా కార్పెంటర్ బాషా, అజీజ్, నూర్‌నాయక్, కోశాధికారిగా నజీర్, గౌరవ సలహా దారులుగా బ్రహ్మారెడ్డి, ఇస్మాయిల్, గౌరవాధ్యక్షులుగా కె.అబూ బకర్, బిఎంఎస్. రఫీయుద్దీన్, అబ్దుల్(ఖాజీసాబ్), హెచ్‌ఎం. రసూల్, టౌన్ బ్యాంక్ జిలాన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సుంకం రఫీ, చాంద్, గోల్డ్‌షాప్ ఇస్మాయిల్, ఎస్ఎం.రఫీ, ఎంపి బాషా, లీగల్ అడ్వైజర్ ఎన్ఎండి ఇస్మాయిల్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ సభ్యులుగా అయూబ్‌బాషా, అబ్దుల్ సుభాన్, రఫీ, సోషల్ మీడియా కమిటీ సభ్యులుగా ఫజుల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడు తూ మండలంలో ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-పుట్లూరు

ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని తెలిపారు. మండలంలోని శనగలగూడూరు గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో వ్యవసాయ శాఖలో అమలవుతున్న అన్నదాత సుఖీభవ, సిహెచ్‌సి డ్రోన్, కౌలు రైతు గుర్తింపు కార్డులు, తదితర అంశాల గురించి వివరిం చారు. ఎన్‌పిసిఐ లింక్ పెండింగ్ ఉన్న వారు బ్యాంకుకి వెళ్లి వారి ఆధార్, బ్యాంక్ ఖాతాకు లింక్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మా బిటిఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఎటిఎం హిమబిందు, గౌతమ్, ఆర్ఎస్‌కెవి సిబ్బంది రాజ్యలక్ష్మి, నాగలింగేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

నవీన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి

పోలీసుల వేధింపులు తాళలేక ఆత్మహ త్యకు పాల్పడిన నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సూర్యవంశం వడియ రాజుల సంఘం (వడ్డెర్ల సంఘం) గౌరవాధ్యక్షుడు, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తల మారుతిప్రసాద్, వడ్డెర్ల సంఘం మండల అధ్యక్షుడు చిరంజీవి కోరారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో బుధవా రం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాలో నవీన్‌పై రాజకీయ దురుద్దేశంతో అక్రమంగా కేసు బనాయించారన్నారు. పోలీసులు కొట్టడం తో మానసికంగా కుంగిపోయిన నవీన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, దీంతో అతని కుటుంబం రోడ్డున పడిందన్నారు. నవీన్ కుటుంబా నికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు హను మంతు, నాయకులు నాగరాజు, ఈరన్న, రాజు, వెంక టరాముడు, ఆంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి-శింగనమల

మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ కవిత

సమాజంలో ఎవరూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కవిత సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం గంజాయి, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, చట్టపరమైన ప్రభావాలపై విద్యార్థులకు వివరించారు. శక్తి యాప్, మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను తెలిపారు. విద్యార్థులు ప్రలోభాలకు లోనుకాకుండా నిబద్ధత, క్రమశిక్షణమైన జీవితం అలవర్చుకోవాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు వాటిని నివారించడంలో శక్తి యాప్ పాత్రను జిల్లా ఈగల్ సెల్ ఎస్ఐ బి.హనుమంత్ అవగాహన కల్పించారు. ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 గురించి తెలిపారు. కార్యక్రమంలో కె.సతీష్, కె.ఎలిజిబెత్, జడికె సుప్రియ, జి.చంద్రశేఖర్, జి.చాంద్ బాషా, కె.గౌసియాబాను, విద్యార్థులు పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో పూజలు చేస్తున్న అధికారులు

జీడిపల్లి రిజర్వాయర్‌లో జలహారతి

బెలుగుప్ప : కర్నూలు జిల్లాలోని మాల్యాల నుంచి ఇప్పటికే 2,075 క్యూసెక్కుల కృష్ణా జలాలు జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరాయి. దీంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. దీంతో బుధవా రం హంద్రీనీవా సుజల స్రవంతి అధికారులు జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. రిజర్వా యర్ మరువు పారడంతో కింది భాగంలో ఉన్న పిఎబిఆర్ డ్యాంకు నీరు వెళ్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ ఎం.రామ సుబ్బయ్య, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఈఈ శ్రీనివాసులు, ఎస్ఈ రాజస్వరూప్‌కుమార్, సిఈ నాగరాజు, ఏఈఈ పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు అరెస్ట్

కళ్యాణదుర్గం టౌన్ : మంత్రి కొలుసు పార్థసారథి పర్యటనను అడ్డుకుంటారనే ముందస్తు సమాచారంతో పోలీసులు వైసిపి నాయకులను అరెస్ట్ చేశారు. మంత్రి బుధవారం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమా లకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పట్టణ, రూరల్ పోలీసులు ముందస్తుగా వైసిపి నాయకులు నాగ రాజు, బిక్కి హరి, షెక్షావలి, సురేష్, సల్లా మారుతి, టైలర్ శీను, దొడగట్ట సూరి, తలారి చరణ్, దొడగట్ట మురళి, ఎరుకుల రమేష్, వడ్డే అజయ్‌లను అదుపులోకి తీసుకుని పట్టణ స్టేషన్‌కు తరలిం చారు. పోలీసుల చర్యలను వారు ఖండించారు.

జగన్‌ను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

బ్రహ్మసముద్రం : తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడి ఆ పార్టీ అధినేత జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, సన్మానించి సత్కరించారు. తనకు మండల కన్వీనర్‌గా అవకాశం ఇచ్చినందుకు జగన్‌కు చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జగన్ మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పని చేయాలన్నారు. క్రియాశీల రాజకీయాలకు నాంది పలకాలన్నారు.

మాజీ సిఎం జగన్‌తో పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి

బైక్‌లు ఢీ.. వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని శింగనగుంటపల్లి గ్రామ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. శింగనగుంటపల్లి గ్రామానికి చెందిన తల్లి కొడుకులైన లక్ష్మీదేవి(65), రమేష్ ద్విచక్ర వాహనంపై తోట వద్దకు వెళ్తుండగా నాయనపల్లె క్రాస్ నుంచి పెద్దపప్పూరు వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. మరో బైక్‌పై వెళ్తున్న ఎర్రిస్వామి తీవ్రంగా గాయపడగా అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో క్రషర్ ఆపరేటర్ మృతి

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో ఉన్న పరమేశ్వరరెడ్డి మెటల్ స్టోన్ క్రషర్‌లో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ ఆపరేటర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలోని నాగులగుడ్డం గ్రామానికి చెందిన రఘురామ్(32) క్రషర్‌లో కొన్నేళ్లుగా కంప్రెషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో క్రషర్ ఆవరణలో ఉన్న కొండపై ఘూతాలు పెడుతుండగా ప్రమాదవశాత్తు కంప్రెషర్ నుంచి ఎగిరి రాళ్లపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.సురేష్, ట్రైనీ ఎస్ఐ గౌతమ్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వృద్ధులపై పిచ్చికుక్క దాడి

యల్లనూరు : మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం ఉదయం ఇద్దరు వృద్ధులపై పిచ్చి కుక్క దాడి చేసింది. ఈ దాడిలో వారు తీవ్రంగా గాయపడ్డారు. కుక్క కరిచేందుకు రాగా రాములమ్మ అనే వృద్ధురాలు కింద పడింది. దీంతో ఆమెను అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.

మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

పుట్లూరు : మండలంలోని మడ్డిపల్లి గ్రామ పొలాల్లో మంగళవారం రాత్రి 12 మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. బాధిత రైతులు తెలిపిన వివరాలు.. రైతు మడ్డిపల్లి రామసుబ్బా రెడ్డికి చెందిన ఆరు మోటార్ల కేబుల్ వైరుతో పాటు మరో ఆరుగురు రైతులకు సంబంధించి మోటార్ల కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు. రెండు నెలల క్రితం కూడా కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయన్నారు. వరుస చోరీలతో రైతులు బెంబేలెత్తుతున్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్

శింగనమల : మండలంలోని తరిమెల గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా ఆర్డీవో కేశవనా యుడు దాడులు నిర్వహించి రెండు టిప్పర్లను సీజ్ చేసి గార్లదిన్నె పోలీస్‌స్టేషన్ తరలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ శింగనమల తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా తరిమెల సమీపంలో నది నుంచి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 2 టిప్పర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.